మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 169 | మంగళవారం | 16 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి



3లో..


## రోడ్డు ప్రమాదాల నివారణకు తిరుపతి
# పోలీసుల చర్యలు హర్షణీయం

- హెల్మెట్ వినియోగంపై అవగాహనకు ప్రశంసలు
- 'నో హెల్మెట్ - నో పెట్రోల్' నిర్ణయం మంచి ఆలోచన
- ప్రజల భద్రత కోసం నిబంధనలు పాటించాలి
- సీఎం చంద్రబాబు

మన గళం, అమరావతి : రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు హర్షణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని సీఎం పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని "నో హెల్మెట్–నో పెట్రోల్" నిబంధనను అమల్లోకి తీసుకురావడం మంచి ఆలోచనగా సీఎం అభినందించారు. ఈ తరహా నిర్ణయాలు ప్రజల్లో









## ఆత్మీయ స్వాగతంతో
# ప్రధాని భావోద్వేగం



- భారత డయాస్పోరా పాత్రపై ప్రశంసలు
- భారత పురోగతిపై గర్వం వ్యక్తం చేసిన ప్రవాసులు

మన గళం డెస్క్ : జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సమాజం ఇచ్చిన ఆత్మీయ స్వాగతం తనను ఎంతో భావోద్వేగానికి గురి చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అక్కడ నివసిస్తున్న భారతీయుల ప్రేమాభిమానాలు, దేశ అభివృద్ధిపై వారు వ్యక్తం చేసిన గర్వం, భారతీయ సంస్కృతిపై ఉన్న అనుబంధం భారత్–ప్రవాస భారతీయుల మధ్య ఉన్న శాశ్వత బంధానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. భారత్

2 లో..

# దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం



- పౌరులకు హెచ్చరికలు
- ఇంట్లోనే ఉండాలని సూచన
- మాస్క్‌లు తప్పనిసరి.. విమాన రవాణాపై ప్రభావం

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నగరంలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. వరుసగా మూడో రోజూ కాలుష్యం తగ్గకపోవడంతో సాధారణ ప్రజలు శ్వాసకోశ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గుండె మరియు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు ఉన్నవారిపై ఈ కాలుష్యం తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీ–నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో నివసిస్తున్న పౌరులకు సింగపూర్ హైకమిషన్ అడ్వైజరీ జారీ చేసింది.

2 లో..



## కన్హా శాంతివనాన్ని సందర్శించిన
# ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఆధ్యాత్మిక–పర్యావరణ కేంద్రంగా అభివృద్ధిపై ప్రశంసలు

మన గళం, హైదరాబాద్ : హైదరాబాద్ నగర శివార్లలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన కన్హా శాంతివనం ఆశ్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సందర్శించారు. ఈ సందర్భంగా కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, పర్యావరణ, విద్యా, ఆరోగ్య సంబంధిత సదుపాయాల గురించి కన్హా ధ్యాన మందిరం అధ్యక్షులు

2 లో..

# అమరజీవి త్యాగాలు మరువలేనవి

- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్

మనగళం, కర్నూలు సిటీ :

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన త్యాగం మరువలేనిదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ భరత్ తెలిపారు. సోమవారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక పూల బజార్ లోని ఆయన విగ్రహానికి మంత్రి టీ.జీ భరత్, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని అధికారంగా జరుపుకోవాలని కూటమి ప్రభుత్వం ప్రకటిం చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు విగ్రహం స్థాపన కొరకు అమరా



2 లో..



# వైసీపీ కోటి సంతకాల ఉద్యమం

- 5 వేల మందితో విజయవాడలో ర్యాలీ

మన గళం, విజయవాడ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లాలో భారీ స్పందన పొందింది. ఈ ఉద్యమంలో భాగంగా జిల్లాలో సేకరించిన సంతకాలను వైసీపీ కేంద్ర కార్యాలయానికి పంపించారు. చుట్టుగుంట సెంటర్ నుంచి శిఖమణి సెంటర్ వరకు సుమారు ఐదు వేల మంది వైసీపీ శ్రేణులు ర్యాలీగా సాగి తమ నిరసనను

2 లో..

# కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

- ఏపీలో టెక్ ఎకోసిస్టం అభివృద్ధిపై చర్చ
- ఏఐ ఆధారిత స్కిల్ పోర్టల్ వివరాల ప్రస్తావన

మన గళం, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మర్యాదపూర్వక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా సమన్వయం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు తెలిపారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



2 లో..

# 84 నిబంధనలు.. రూ.50 వేల భద్రతా డిపాజిట్



- ఈనెల 18న విజయపురిలో ప్రచార సభ
- షరతులతో అనుమతి ఇచ్చిన పోలీసులు
- 84 నిబంధనలు.. రూ.50 వేల భద్రతా డిపాజిట్

మన గళం, ఈరోడ్ : కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ చీఫ్ విజయ్ మరో ఎన్నికల ప్రచార ర్యాలీకి సిద్ధమయ్యారు. ఇటీవల పుదుచ్చేరిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమం అనంతరం, ఈసారి తమిళనాడులోని ఈరోడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఈరోడ్ పోలీసులు తాజాగా అనుమతి

2 లో..

## ఆత్మీయ స్వాగతంతో ప్రధాని భావోద్వేగం




సాధిస్తున్న పురోగతిని గర్వంగా చెప్పుకుంటూ, దేశ సంస్కృతిని విదేశీ గడ్డపై నిలబెట్టుతున్న ప్రవాస భారతీయుల పాత్ర అభినందనీయమని ప్రధాని అన్నారు. వారు భారతీయ విలువలు, సంప్రదాయాలను తరతరాలకు చేరవే స్తూ, దేశ గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో పెంచుతున్నారని ప్రశంసించారు. అలాగే భారత్–జోర్డాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం లో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వాణిజ్యం, సంస్కృతి, ప్రజల మధ్య అనుబంధాన్ని పెంపొం దించడం లో డయాస్పోరా చేస్తున్న సేవలు ఇరు దేశాల సంబంధాలకు బల మైన పునాదిగా మారుతున్నాయని తెలిపారు. భారత డయాస్పోరా ఎప్పటికీ దేశానికి గర్వకారణమని ప్రధాని వ్యాఖ్యానించారు. విదేశాల్లో ఉన్నా, హృదయ పూర్వకంగా భారత్‌తో ముడిపడి ఉన్న ప్రవాసుల సహకారం భారత్–జోర్డాన్ సంబంధాలను మరింత ఎత్తుకు తీసుకెళ్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు తిరుపతి పోలీసుల చర్యలు హర్షణీయం



చైతన్యం తీసుకువచ్చి, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో దోహదపడతాయని తెలిపారు. భద్రత అనేది వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కూడా అని సీఎం స్పష్టం చేశారు. ఈ నిబంధనపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తిరుపతి జిల్లాలో 700 ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఈ ర్యాలీని ఘనంగా నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు తీసుకెళ్లినప్పుడే ఫలితం ఉంటుందని ఆయన అన్నారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు స్వయంగా పాల్గొనడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల భద్రత కోసమే ప్రభుత్వం నిబంధనలు, సూచనలు తీసుకువస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను కోరారు.

## దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం




అవసరం లేని సందర్భాల్లో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని సూచించింది. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించాలని, ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికింది. ఈ సూచనలు ముఖ్యంగా ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో నివసిస్తున్న సింగపూర్ పౌరులు తప్పనిసరిగా పాటించాలని కోరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు విడుదల చేసిన 'సమీర్' యాప్ ప్రకారం.. మధ్యాహ్నం సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 437గా నమోదైంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ 400కు పైగా ఉండటంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. దీనితో పాటు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) నాలుగో దశను అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాలుష్యం వల్ల దృశ్యమానత తగ్గడంతో విమాన రాకపోకలపైనా ప్రభావం పడింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 400కిపైగా విమానాలు ఆలస్యమయ్యాయి. 61 విమానాలు రద్దుకాగా, ఐదు విమానాలను ఇతర మార్గాలకు మళ్లించారు. పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రయాణానికి ముందు తాజా సమాచారం తెలుసుకోవాలని సూచిస్తున్నాయి.

## అమరజీవి త్యాగాలు మరువలేనవి




వతిలో 5 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. నగరంలో ఉన్న పొట్టి శ్రీరా ములు విగ్రహాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. నేటి యువత పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడిచి రాష్ట్రానికి, దేశానికి తమ వంతు సేవ చేయాలన్నారు. ఆంధ్రరాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19న నిరాహారదీక్ష ప్రారంభించారని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనలో 1952 డిసెంబర్ 15న అసువులు బాసారని తెలిపారు. ఆంధ్రుల కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయం అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ, రాష్ట్రాభివృద్ధికి అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, బీసీ సంక్షేమ అధికారి ప్రసున్న తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కోటి సంతకాల ఉద్యమం




గట్టిగా వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం సంతకాలు సేకరించిన పత్రాల వాహనాన్ని వైసీపీ నేతలు జెండా ఊపి కేంద్ర కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్, వెస్ట్ ఇంచార్జ్ వెల్లంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ ఇంచార్జ్ మల్లాది విష్ణు, నందిగామ ఇంచార్జ్ మొండితోక జగన్మోహన్ రావు, జగ్గయ్యపేట ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, తిరువూరు ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాస్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మొత్తం 4,21,217 మంది ప్రజల సంతకాలు సేకరించినట్లు తెలిపారు. ఈ ఉద్యమం విజయవంతం కావడానికి కృషి చేసిన నియోజకవర్గ ఇంచార్జులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వం గుర్తించి, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎప్పటికైనా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెనక్కి తగ్గాలని దేవినేని అవినాష్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి పైగా ప్రజలు తమ సంతకాల ద్వారా నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సంతకాల మొత్తాన్ని ఈ నెల 18వ తేదీన వైసీపీ అధినేత జగన్ గవర్నర్‌కు అందజేస్తారని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు, డివిజన్ కార్పొరేటర్లు, అధ్యక్షులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు, సోషల్ మీడియా విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.

## ఈరోడ్‌లో విజయ్ రాజకీయ ర్యాలీ



మంజూరు చేశారు. ఈనెల 18వ తేదీన ఈరోడ్ పరిధిలోని విజయపురి ప్రాంతంలో విజయ్ ఎన్నికల ప్రచార ర్యాలీ జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం కొనసాగనుంది. సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రైవేట్ ఆలయానికి సంబంధించిన స్థలంలో ఈ సభను నిర్వహించనున్నారు. కరూర్ ఘటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కఠినమైన భద్రతా నిబంధనలు విధించారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు మొత్తం 84 షరతులతో అనుమతి ఇచ్చారు. కార్యక్రమ నిర్వాహకులు భద్రతా డిపాజిట్‌గా రూ.50 వేల మొత్తాన్ని చెల్లించాలని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాదు, సభ ముగిసిన వెంటనే వేదిక, పరిసర ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచి మునుపటిలాగే అప్పగించాలని ఆదేశించారు. పోలీసుల అనుమతి రావడంతో టీవీకే పార్టీ శ్రేణులు ర్యాలీ ఏర్పాట్లను వేగవంతం చేశాయి. ఈ సభ విజయ్ రాజకీయ భవిష్యత్తుకు కీలకంగా మారనుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## కన్హా శాంతివనాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

దాజీ ముఖ్యమ ంత్రికి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ కేంద్రం సమగ్ర మానవ అభివృద్ధికి దోహదపడుతున్న విధానాన్ని వివరించారు. కన్హా శాంతివనంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన మందిరాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే ఆధునిక వెల్‌నెస్ సెంటర్, యోగా సదుపాయాలను సందర్శించి, అక్కడ అందిస్తున్న సేవలపై అధికారులతో చర్చించారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రూపొందించిన ఈ సదుపాయాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా హార్ట్‌ఫుల్నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, పుల్లెల గోపీచంద్ అంతర్జాతీయ శిక్షణ అకాడమీని కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. విద్యతో పాటు క్రీడల ద్వారా యువతలో సమగ్ర అభివృద్ధి సాధించాలన్న ఆలోచన ప్రశంసనీయమని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను వెలికి తీసేలా ఈ సంస్థలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా చెట్ల సంరక్షణ కేంద్రం, వర్షపు నీటి సంరక్షణ ఏర్పాట్లు, వ్యవసాయ క్షేత్రాలను ముఖ్యమంత్రి సందర్శించారు. పర్యావరణ పరిరక్షణకు కన్హా శాంతివనం చేపడుతున్న చర్యలను సీఎం అభినందించారు. ప్రకృతి, ఆధ్యాత్మికత, ఆరోగ్యం, విద్య అన్నింటిని సమన్వయపరిచి అభివృద్ధి చేస్తున్న ఈ తరహా కేంద్రాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ



అభివృద్ధి చేస్తున్న ఏఐ ఆధారిత స్కిల్ పోర్టల్ వివరాలను మంత్రి నారా లోకేష్ కేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా యువత నైపుణ్యాలను సమగ్రంగా గుర్తించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచేలా ఈ డిజిటల్ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల తాను చేపట్టిన అమెరికా పర్యటన వివరాలను కూడా మంత్రి నారా లోకేష్ కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఆ పర్యటనలో ప్రముఖ టెక్నాలజీ సంస్థలతో జరిగిన సమావేశాలు, పెట్టుబడుల అవకాశాలు, టెక్ రంగంలో భాగస్వామ్యాలపై జరిగిన చర్చలను వివరించినట్లు సమాచారం. ఈ సంప్రదింపులు రాష్ట్రంలో ఐటీ, ఏఐ రంగాల అభివృద్ధికి దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బలమైన టెక్నాలజీ ఎకోసిస్టం అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంతో సన్నిహితంగా పనిచేయాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. కేంద్ర–రాష్ట్ర సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ముందంజలో నిలబెట్టే దిశగా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించండి

– జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వాడకంలో పొదుపుపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ఇంధన పరిరక్షణ, సంరక్షణ" కు సంబంధించిన వారోత్సవాల పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారని తెలిపారు. రోజు రోజుకు విద్యుత్ వాడకం అధికం అవుతున్న నేపథ్యంలో విద్యుత్ వృథా కాకుండా ఆదా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.విద్యుత్ ను సమర్థవంతంగా వినియోగించుకునేలా విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు, కళాశాల విద్యార్థులకు వర్క్ షాపులు నిర్వహించి విద్యుత్ సంరక్షణ పై అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు,ఇతర వినియోగదారులకు, రైతులకు విద్యుత్ పొదుపు ఆవశ్యకత, సమర్థవంతంగా వినియోగించుకోవడంపై వివరించాలన్నారు. వినియోగదారులకు కరపత్రాలను పంపిణీ చేసి విద్యుత్ ఆదా గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ ప్రదీప్, డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, ఏపీఎస్పీడిసిఎల్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

– స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయాలి – శాఖల పనితీరుపై పాజిటివ్ పర్సెప్షన్ పెంచేలా తనిఖీలు అవసరం
– ప్రజల ఆదాయం పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి – జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన ప్రజా అర్జీలు, పరిష్కారాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలోపు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని, రీ ఓపెన్ కు ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఆయా శాఖల పరిధిలో అర్జీలను నాణ్యంగా పరిష్కరించేందుకు చేపడుతున్న ఆడిట్ ప్రక్రియ పెండింగ్ ఉన్న శాఖలు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు మండలాలకు వెళ్ళి నిరంతరంగా పర్యవేక్షణ చేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి సేకరిస్తున్న ఫీడ్ బ్యాక్ పాజిటివ్ గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులు వచ్చిన చోట తనిఖీలు చేసి, పరిస్థితిని సరిదిద్దాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజల ఆదాయం పెంపొందించుకునే విధంగా వ్యవసాయం, అనుబంధ రంగాలు, ప్రభుత్వ పథకాలతో అనుసంధానించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారుల పనితీరును పరిశీలించి, గ్రేడింగ్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలుపరిష్కార స్థితి, క్షేత్ర స్థాయి తనిఖీలు, ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, తగ్గితర అంశాలను గ్రేడింగ్‌లో పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రేడింగ్ ద్వారా ఆయా శాఖల అధికారుల పనితీరు బాగుండేలా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈపిటీఎస్ పోర్టల్‌లో డాక్యుమెంట్స్ అప్లోడ్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, జిల్లా అధికారులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు కొండయ్య, అనూరాధ, జిల్లా అధికారులు పూలమాల వేసి నివాళు లర్పించారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర పరిధిలోని 36, 37, 41 వ వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ ఎదుట ధర్నా చేశారు. రోడ్లు నిర్మించాలని, స్మశాన వాటికి స్థలం కేటాయించాలని కోరుతూ సీపీఎం నగర నాయకులు శ్యామల అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించి మేనేజర్ కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి టి రాముడు, మాజీ కార్పొరేటర్ అలివేలు, నాయకులు నగేష్ మాట్లాడుతూ ఎల్లమ్మ గుడి నుండి వాసు హోటల్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అప్పుడప్పుడు ప్రమాదాలకు గురువుతున్నారన్నారు.ఈ వార్డుల పరిధి 50వేల పైబడి జనాభా నివసిస్తున్నప్పటికీ కనీసం స్మశాన వాటిక కూడా లేకపోవడంతో జమ్మి చెట్టు కల్లూరు స్మశాన వాటికకు తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు.అర్హులైన పేదలకు సామాజిక పెన్షన్లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజల్ని సమీకరించి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించవలసి వస్తుందని హెచ్చరించారు.కార్యక్రమంలో జిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి రహిమాన్, నాయకులు సత్యం, జమ్మన్న, మద్దిలేటి, షబానా, జానీ, మహేశ్వరి, సులోచన, బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక మేనేజర్ యన్.చిన్నరాముడు అన్నారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన పీజిఆర్‌యస్‌కి 23 ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఆర్ఓ జునైద్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, టిడ్కో అధికారి డాక్టర్ పెంచలయ్య, సూపరింటెండెంట్ వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోండి



మనగళం, కర్నూలు సిటీ : కరోనా సమయంలో తొలగించిన ఆర్టీసీ కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ కు సీఐటీయూ సహాయ కార్యదర్శి సాయి బాబా, సీఐటీయూ నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి బాబా, మహమ్మద్ రఫీ మాట్లాడుతూ దళిత కుటుంబాలకు చెందిన 43 మంది కార్మికులు గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్నారని, కరోనా సమయంలో ఆర్టీసీ అధికారులు 24 మంది కార్మికులను తొలగించారన్నారు. అయితే గతంలో అధికారులు స్పందించి 15 మందిని మాత్రమే పనిలోకి తీసుకున్నారన్నారు. మిగిలిన తొమ్మిది మంది కార్మికులు ఉపాధి కరువై ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొమ్మిది మందిని పనిలోకి తీసుకుని వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

## అనుమతుల్లేని డయాగ్నోస్టిక్ సెంటర్ లను సీజ్ చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : అనుమతులు లేకుండా, రెన్యువల్స్ చేయకుండా నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్ లను సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం డీవైఎఫ్ఐ కర్నూలు న్యూసిటీ కమిటీ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఎటువంటి రిజిస్ట్రేషన్ లు లేకుండా, రెన్యువల్స్ చేయకుండా డయాగ్నొస్టిక్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని విమర్శించారు. ఈ సెంటర్ల నిర్వాహకులు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నాయని, పరీక్షల నిమిత్తం వచ్చిన ప్రజలు డయాగ్నొస్టిక్ సెంటర్ల దగ్గర జేబులో ఖాళీ చేసుకుని వెళ్ళవలసిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు డీవైఎఫ్ఐ నిర్వహించిన సర్వేలో చాలావరకు ఎటువంటి అనుమతులు లేకుండా డయాగ్నొస్టిక్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తేలిందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అనుమతులు లేని,రెన్యువల్సు చేయని డయాగ్నొస్టిక్ సెంటర్ లను సీజ్ చేసి,నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఇమ్రాన్, నాయకులు వీరేశ్, సుకన్య, జయంతి తదితరులు పాల్గొన్నారు.

## 17న వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో మెగా జాబ్ మేళా



మనగళం, కర్నూలు సిటీ : వెల్దుర్తి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో డిసెంబర్ 17వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను జిల్లా యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పిలుపునిచ్చారు.

సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ %-% పిజిఆర్ఎస్) కార్యక్రమం అనంతరం, నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి గారు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ గారు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 17వ తేదీన ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 14 ప్రైవేటు కంపెనీలు పాల్గొని సుమారు 500 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు యువతీ-యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. పదవ తరగతి నుండి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన వారు తమ అర్హతకు తగిన ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఉందన్నారు. ఉద్యోగ మేళాలో పాల్గొనే అభ్యర్థులు ముందుగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారిణి దీప్తి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 96033 03354, 79812 22035 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డోన్ పట్టణంలో 'డోన్ ఫార్మసీ' ప్రారంభం




మన గళండోన్ పట్టణంలోని కృష్ణా లాడ్జ్ సమీపంలో డోన్ ఫార్మసీ నూతనంగా ప్రారంభమైంది. ఈ ఫార్మసీ ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు సేవలందించనుందని నిర్వాహకులు తెలిపారు.అదేవిధంగా డోర్ డెలివరీ సదుపాయం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన మందులు, మెరుగైన ఆరోగ్య సేవలు సులభంగా అందించాలనే లక్ష్యంతో ఈ ఫార్మసీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. సంప్రదించాల్సిన నంబర్లు: 93478 33151, 80081 33151

## ఘనంగా నిర్వహించిన పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు





మన గళండోన్ పట్టణంలోనిఅమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సందర్భంగా ఈరోజు సోమవారం పాతపేట పూల మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి మరియు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర విభజన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కొనియాడారు.

## సీఆర్ఎంటీల సమస్యలు పరిష్కరించాలి

మనగళం, కర్నూలు సిటీ : సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న సీఆర్ఎం టీచర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు కోరారు. సీఆర్ఎంటీల జిల్లా నాయకుడు పుల్లన్న అధ్యక్షతన టీచర్లు చేస్తున్న ఆందోళనకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. స్థానిక ధర్నా చౌక్ దగ్గర ఆందోళన చేస్తున్న సీఆర్ఎంటీల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కనీస వేతనాలు అమలు చేయాలని, సీఆర్ఎంటీలకు అదనపు భారం తగ్గించాలని కోరారు. సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న సీఆర్ఎంటీలను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీలో సీఆర్ఎంటీలకు వెయిటేజ్ ని ఇవ్వాలని కోరారు. గతంలో ఇస్తున్నట్లుగానే ట్రావెలింగ్ అలవెంచలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఆర్ఎంటీలకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ మహమ్మద్ రఫీ జిల్లా చైర్మన్ రంగన్న జిల్లా నాయకులు దుర్గప్ప రామాంజనేయులు ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలు ఆదర్శనీయం



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర ఐక్యత కోసం త్యాగం ఒకరు, దేశ ఐక్యత కోసం మరొకరు కృషి చేసిన మహనీయుల త్యాగాలే మనకు ఆదర్శమని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాషా కొనియాడారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిలానీ బాషా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి అమరజీవి అయ్యారన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా నెహ్రూ మంత్రివర్గంలో హోం శాఖా మంత్రిగా, ఉప ప్రధానిగా పదవులు నిర్వహించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యా నంతరం భారతదేశంలో విలీనం కావడానికి నిరాకరించిన హైదరాబాదు, జునాగఢ్ లాంటి సంస్థానాధీశులను సైనిక చర్యతో మట్టికరిపించి దేశంలో విలీనం చేసిన ఘనత వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కోడుమూరు కో ఆర్డినేటర్ అనంత రత్నం మాదిగ, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, నాయకులు జి వెంకటస్వామి, రియాజుద్దీన్, డబ్ల్యు సత్య రాజు, షేక్ మాలిక్ బాషా, కేశవ రెడ్డి, హుస్సేన్ బాషా, లోకరామయ్య, దస్తగిరి మొదలగువారు పాల్గొన్నారు.

## కదలి వెళ్లిన వైయస్సార్ శ్రేణులు..



మన గళం బనగానపల్లె : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా కోటి సంతకాల పత్రులను నంద్యాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కేంద్రం కు సోమవారం బనగానపల్లె మాజీ శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి, వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విఘ్నేశ్వర రెడ్డి , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు రామిరెడ్డి ఆధ్వర్యంలో వారి స్వగృహం నుంచి జిల్లా కార్యాలయానికి భారీ సంఖ్యలో వాహనాలలో తరలి వెళ్లడం జరిగింది.

## డాన్ బోస్కో శికారి ప్రాజెక్ట్ భూమి పూజ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కొడుమూరు ఎమ్మెల్యే





మన గళం కర్నూలు: డాన్ బోస్కో సంస్థ ఆధ్వర్యంలో శికారి మహిళలకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ ట్రైనింగ్) అందించేందుకు పసుపుల గ్రామంలో డాన్ బోస్కో శికారి ప్రాజెక్ట్ భూమి పూజ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాన్ బోస్కో శికారి మహిళలు ఆర్థికంగా మెరుగుపడడానికి ఇలాంటి స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం అని తెలియజేశారు. డాన్ బోస్కో సంస్థ చేపడుతున్న ఈ శికారి ప్రాజెక్ట్ ద్వారా మహిళలకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం కావాలన్న అందిస్తామని తెలియజేశారు. కావున శికారి ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల కు ట్యూషన్ చెప్పాలన్న ఉద్దేశ్యం కూడా చాలా మంచి పరిణామం అన్నారు.కావున శికారి ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాన్ బోస్కో సంస్థ డైరెక్టర్ సంజయ్ , సంస్థ ప్రతినిధులు, పసుపుల పంచాయతీ సెక్రటరీ హేమంత్ కుమార్ విఆర్ఓ మద్దిలేటి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, శికారి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ న్యూ ఇయర్ 2026 ప్రీపెయిడ్ ప్లాన్లు విడుదల చేసిన రిలయన్స్ జియో

హైదరాబాద్ , డిసెంబర్ 15, మన గళం : కొత్త సంవత్సరం సందర్భంగా రిలయన్స్ జియో తన ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా హ్యాపీ న్యూ ఇయర్ 2026 ప్లాన్లను ప్రకటించింది. నెలవారీ, వార్షిక ప్యాకేజీలతో పాటు డేటా అదనపు పథకాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా అన్ని ప్లాన్లతో కలిసి గూగుల్ జెమిని ప్రో ఆధారిత కృత్రిమ మేధ సేవలను ఉచితంగా అందించడం విశేషంగా మారింది.

కొత్తగా ప్రవేశపెట్టిన ఒక ప్లాన్‌లో 28 రోజుల చెల్లుబాటు కాలంతో రోజుకు 2 జీబీ డేటా, పరిమితుల్లేని కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తున్నాయి. అదనంగా 5 జీబీ డేటాతో పాటు పలు వినోద మాధ్యమాలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ ప్యాకేజీతో పాటు 18 నెలల పాటు గూగుల్ జెమిని ప్రో సేవలను ఉచితంగా వినియోగించే అవకాశం కూడా ఉంది.

వార్షికంగా తీసుకునే వినియోగదారుల కోసం మరో ప్రత్యేక ప్యాకేజీని జియో అందిస్తోంది. ఈ పథకం ద్వారా 365 రోజుల పాటు రోజుకు 2.5 జీబీ డేటా, పరిమితుల్లేని కాల్స్, ఎస్ఎంఎస్ సదుపాయం లభిస్తుంది. దీనికీ 18 నెలల పాటు జెమిని ప్రో సేవలను ఉచితంగా జత చేశారు. అలాగే తక్కువ ధరతో అదనపు డేటా పొందే అవకాశాన్ని కూడా కల్పించారు.

కొత్త సంవత్సరం సందర్భంగా వినియోగదారులకు అధిక విలువ కలిగిన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ప్లాన్లను రూపొందించినట్టు జియో తెలిపింది. డేటా వినియోగం, వినోదం, ఆధునిక సాంకేతిక సేవలు అన్నింటినీ ఒకే ప్యాకేజీలో అందించడం వల్ల ఈ ప్రీపెయిడ్ ప్లాన్లు వినియోగదారుల్లో మంచి ఆసక్తిని రేపుతున్నాయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## విజయ్ దివస్: త్యాగాల రక్తాక్షరాలతో రాసిన విజయం... భారత ఆత్మగౌరవానికి శాశ్వత సాక్ష్యం

డిసెంబర్ 16 అంటే భారతదేశానికి ఒక తేదీ కాదు.. ఒక చైతన్యం. 1971 భారత – పాకిస్తాన్ యుద్ధంలో సాధించిన ఘనవిజయాన్ని గుర్తు చేసుకునే విజయ్ దివస్, దేశ చరిత్రలో త్యాగాలపై నిలిచిన గర్వభరిత అధ్యాయం. ఈ యుద్ధం భూభాగాల కోసం సాగిన యుద్ధం కాదు. అధికారం కోసం జరిగిన పోరాటం కాదు. మానవ హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం, అణచివేతకు గురైన ప్రజల గళం కోసం భారత్ చేసిన చారిత్రాత్మక జోక్యం. అందుకే ఈ విజయం కేవలం సైనిక విజయంగా కాకుండా, నైతిక విజయం గానూ ప్రపంచం గుర్తించింది. 1971 నాటికి తూర్పు పాకిస్తాన్‌లో పరిస్థితులు అమానుష స్థాయికి చేరాయి. అక్కడి ప్రజలపై పాకిస్తాన్ సైన్యం జరిపిన హింస, అత్యాచారాలు, హత్యాకాండలు ప్రపంచాన్ని కుదిపేశాయి. లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి భారత్ వైపు తరలివచ్చారు. శరణార్థుల ప్రవాహం భారత సామాజిక, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని తెచ్చింది. అయినా భారత్ వెనకడుగు వేయలేదు. మానవత్వాన్ని ప్రథమ స్థానంలో ఉంచింది. అప్పటి నాయకత్వం తీసుకున్న నిర్ణయయనిశ్శబ్దంగా ఉండటం కంటే చరిత్రలో నిలిచేలా నిలబడటయదేశ భవిష్యత్తును మార్చింది. ఇందిరా గాంధీ నాయకత్వంలో భారత్ యుద్ధరంగంలోకి దిగింది. అంతర్జాతీయ రాజకీయ ఒత్తిళ్లు, శక్తివంతమైన దేశాల హెచ్చరికలు ఉన్నా, దేశం వెనక్కి తగ్గలేదు. ఫలితయకేవలం 13 రోజుల్లోనే యుద్ధం ముగింపు. డిసెంబర్ 16న ఢాకాలో పాకిస్తాన్ సైన్యం లొంగిపోవడం ప్రపంచ సైనిక చరిత్రలోనే అతిపెద్ద లొంగుబాట్లలో ఒకటిగా నిలిచింది. ఈ విజయంతో బంగ్లాదేశ్ అనే కొత్త దేశం అవతరించింది. ఇది దక్షిణ ఆసియా రాజకీయ పటాన్ని పూర్తిగా మార్చేసింది. భారత్ ప్రాంతీయ శక్తిగా మాత్రమే కాకుండా, బాధ్యతాయుత ప్రపంచ దేశంగా గుర్తింపు పొందింది. ఈ విజయానికి అసలైన మూలం భారత సైనికుల త్యాగం. భూసేన, నౌకాదళం, వాయుసేనమూడు దళాలు అపూర్వ సమన్వయంతో పని చేశాయి. ప్రాణాలు పణంగా పెట్టి ముందుకు సాగిన సైనికులు, తమ వెనుక ఉన్న కుటుంబాలను, కలలను తాత్కాలికంగా కాదు%ౌ% శాశ్వతంగా కూడా వదిలిన వీరులు ఎందరో. వారి రక్తంతోనే ఈ విజయం సాధ్యమైంది. ఈ రోజు మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నామంటే, అది వారి త్యాగాల ఫలితం అనే నిజాన్ని విస్మరించలేం. విజయ్ దివస్ మనకు ఒక గట్టి పాఠం చెబుతుంది. దేశ భద్రత అనేది సైనికుల బాధ్యత మాత్రమే కాదు. పౌరుల బాధ్యత కూడా. స్వేచ్ఛను తేలికగా తీసుకుంటే, చరిత్ర మళ్లీ పరీక్షిస్తుంది. త్యాగాలను గౌరవిస్తే, దేశం మరింత బలంగా నిలుస్తుంది. ఈ తరం చేయాల్సింది గతాన్ని కేవలం జ్ఞాపకంగా ఉంచడం కాదు. ఆ త్యాగాల విలువను అర్థం చేసుకుని, దేశ ఐక్యతను కాపాడే బాధ్యతను భుజాన వేసుకోవడం. విజయ్ దివస్ అంటే జెండాలు, పరేడ్‌లు మాత్రమే కాదు. అది ఒక ఆత్మపరిశీలన. అది ఒక జాతీయ సంకల్పం. త్యాగాల మీద నిలిచిన ఈ విజయం.. భారతదేశం ఎప్పటికీ తలవంచదని చెప్పే శాశ్వత ప్రకటన.డిసెంబర్ 16 అంటే భారతదేశానికి ఒక తేదీ కాదు%ౌ% ఒక చైతన్యం. 1971 భారత–పాకిస్తాన్ యుద్ధంలో సాధించిన ఘనవిజయాన్ని గుర్తు చేసుకునే విజయ్ దివస్, దేశ చరిత్రలో త్యాగాలపై నిలిచిన గర్వభరిత అధ్యాయం. ఈ యుద్ధం భూభాగాల కోసం సాగిన యుద్ధం కాదు. అధికారం కోసం జరిగిన పోరాటం కాదు. మానవ హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం, అణచివేతకు గురైన ప్రజల గళం కోసం భారత్ చేసిన చారిత్రాత్మక జోక్యం. అందుకే ఈ విజయం కేవలం సైనిక విజయంగా కాకుండా, నైతిక విజయం గానూ ప్రపంచం గుర్తించింది.

1971 నాటికి తూర్పు పాకిస్తాన్‌లో పరిస్థితులు అమానుష స్థాయికి చేరాయి. అక్కడి ప్రజలపై పాకిస్తాన్ సైన్యం జరిపిన హింస, అత్యాచారాలు, హత్యాకాండలు ప్రపంచాన్ని కుదిపేశాయి. లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి భారత్ వైపు తరలివచ్చారు. శరణార్థుల ప్రవాహం భారత సామాజిక, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని తెచ్చింది. అయినా భారత్ వెనకడుగు వేయలేదు. మానవత్వాన్ని ప్రథమ స్థానంలో ఉంచింది. అప్పటి నాయకత్వం తీసుకున్న నిర్ణయయనిశ్శబ్దంగా ఉండటం కంటే చరిత్రలో నిలిచేలా నిలబడటయదేశ భవిష్యత్తును మార్చింది. ఇందిరా గాంధీ నాయకత్వంలో భారత్ యుద్ధరంగంలోకి దిగింది. అంతర్జాతీయ రాజకీయ ఒత్తిళ్లు, శక్తివంతమైన దేశాల హెచ్చరికలు ఉన్నా, దేశం వెనక్కి తగ్గలేదు. ఫలితయకేవలం 13 రోజుల్లోనే యుద్ధం ముగింపు. డిసెంబర్ 16న ఢాకాలో పాకిస్తాన్ సైన్యం లొంగిపోవడం ప్రపంచ సైనిక చరిత్రలోనే అతిపెద్ద లొంగుబాట్లలో ఒకటిగా నిలిచింది. ఈ విజయంతో బంగ్లాదేశ్ అనే కొత్త దేశం అవతరించింది. ఇది దక్షిణ ఆసియా రాజకీయ పటాన్ని పూర్తిగా మార్చేసింది. భారత్ ప్రాంతీయ శక్తిగా మాత్రమే కాకుండా, బాధ్యతాయుత ప్రపంచ దేశంగా గుర్తింపు పొందింది. ఈ విజయానికి అసలైన మూలం భారత సైనికుల త్యాగం. భూసేన, నౌకాదళం, వాయుసేనమూడు దళాలు అపూర్వ సమన్వయంతో పని చేశాయి. ప్రాణాలు పణంగా పెట్టి ముందుకు సాగిన సైనికులు, తమ వెనుక ఉన్న కుటుంబాలను, కలలను తాత్కాలికంగా కాదు%ౌ% శాశ్వతంగా కూడా వదిలిన వీరులు ఎందరో. వారి రక్తంతోనే ఈ విజయం సాధ్యమైంది. ఈ రోజు మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నామంటే, అది వారి త్యాగాల ఫలితం అనే నిజాన్ని విస్మరించలేం. విజయ్ దివస్ మనకు ఒక గట్టి పాఠం చెబుతుంది. దేశ భద్రత అనేది సైనికుల బాధ్యత మాత్రమే కాదు. పౌరుల బాధ్యత కూడా. స్వేచ్ఛను తేలికగా తీసుకుంటే, చరిత్ర మళ్లీ పరీక్షిస్తుంది. త్యాగాలను గౌరవిస్తే, దేశం మరింత బలంగా నిలుస్తుంది. ఈ తరం చేయాల్సింది గతాన్ని కేవలం జ్ఞాపకంగా ఉంచడం కాదు. ఆ త్యాగాల విలువను అర్థం చేసుకుని, దేశ ఐక్యతను కాపాడే బాధ్యతను భుజాన వేసుకోవడం. విజయ్ దివస్ అంటే జెండాలు, పరేడ్‌లు మాత్రమే కాదు. అది ఒక ఆత్మపరిశీలన. అది ఒక జాతీయ సంకల్పం. త్యాగాల మీద నిలిచిన ఈ విజయం.. భారతదేశం ఎప్పటికీ తలవంచదని చెప్పే శాశ్వత ప్రకటన.

# రాత్రి మెట్రో సేవలు పొడిగించాలంటూ నగరవాసుల డిమాండ్



హైదరాబాద్ , డిసెంబర్ 15, మన గళం : హైదరాబాద్ నగరంలో రాత్రి వేళల్లో మెట్రో సేవలను పొడిగించాలని నగరవాసులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, సినిమాలు, షాపింగ్ పూర్తయ్యాక రాత్రి వేళల్లో సురక్షితంగా ఇంటికి చేరేందుకు మెట్రోపై ఆధారపడే ప్రయాణికులు అధికంగా ఉండగా, ప్రస్తుతం రాత్రి పదకొండు గంటలకే చివరి రైలు ఆగిపోవడం తమకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు చెబుతున్నారు. గతంలో నగరంలో రాత్రి పదకొండు నలభై ఐదు నిమిషాల వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉండేవని, ఆ సమయాన్ని తగ్గించడం వల్ల మహిళలు, యువత, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగరం రాత్రివేళల్లో కూడా చురుగ్గా కొనసాగుతున్న నేపథ్యంలో మెట్రో సమయాలు తగ్గించడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. తక్కువ చార్జీలతో సురక్షితమైన ప్రయాణం కల్పించే మెట్రో సేవలు రాత్రి పొడిగిస్తే వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి ట్రాఫిక్ సమస్యలు కూడా కొంత మేర తగ్గుతాయని నగరవాసులు అంటున్నారు. ఇతర మహానగరాల్లో రాత్రివేళల్లో మెట్రో సేవలు కొనసాగుతున్నాయని, అలాంటప్పుడు హైదరాబాద్‌లో సమయాలను కుదించడం వెనుక కారణాలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన మెట్రో వార్షికోత్సవ సర్వేలో కూడా ప్రయాణికులు ప్రధానంగా రాత్రి సేవల పొడిగింపునే కోరినట్లు తెలుస్తోంది. అయితే నిర్వహణ వ్యయాలు, ప్రయాణికుల సంఖ్య తగ్గడం వంటి కారణాలతో సమయాలను తగ్గించినట్లు అధికారులు చెబుతున్నా, భద్రత, నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ డిమాండ్‌పై మెట్రో యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు నగరవాసుల్లో ఆసక్తిగా మారింది.

# జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాల మేరకు...!

**– పారిశుధ్యం నిర్వహణ.. వసతి గృహాలలో వసతులు పే విస్తృత తనిఖీలు చేపట్టిన... ఎంపీడీవో జాన్ సుందరం**





మన గళం పెద్దారవీడు : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ,ప్రభుత్వ వసతి గృహాలు అమలుపై జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాల మేరకు మండలంలో సోమవారం ఎంపీడీవో జాన్ సుందరం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో భాగంగా మొదటగా బీ.చెర్లో పల్లె గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ భాగ్యలక్ష్మి తో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం పెద్దారవీడు, దేవరాజు గట్టు సచివాలయ పరిధిలోని పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలను ఎంపీడీవో జాన్ సుందరం చేశారు. అనంతరం పెద్దారవీడు ఎస్సీ బాలుర ప్రభుత్వ హాస్టల్ లను తనిఖీ చేశారు. హాస్టల్లో ఉన్న వంటగదిని, వంట సరుకులు, స్టోర్ రూమ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంట సరుకుల నాణ్యతను, విద్యార్థులు భోజనం చేసే హాలును పరిశీలించి వంట చేసే నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చారు.నాణ్యతలేని సరుకులను వంటకు ఉపయోగించొద్దని నూతన మెనూ ప్రకారమే భోజనం నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను వంట చేసే నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని, అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జామ్ సుందరం ఆదేశించారు.

# ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలాదేవి రచించిన..

**– విద్యార్థులారా చెడు నడతలు వద్దు పాట ఆవిష్కరించిన... ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

మనగళం ,మార్కాపురం: విద్యార్థులు, యువత నేటి సమాజంలో ఎదుర్కొంటున్న దుష్పరిణామాలైన మాదకద్రవ్యాలు, బెట్టింగులు, ప్రేమ, ఆత్మహత్యలు, ర్యాగింగ్ వంటి సమాజ వ్యతిరేక కార్యకలాపాలపై జడ్ పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో ఆ పాఠశాల అసిస్టెంట్ పిడి డోలా శ్యామలా దేవి స్వీయ రచన స్వర కల్పన చేసిన విద్యార్థుల్లారా చెడు నడతలు నడవద్దు అనే పాటను ఉపాధ్యాయుల క్రీడోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత నేటి సమాజంలో ఎదుర్కొంటున్న మా దకద్రవ్యాల వాడకం, బెట్టింగ్, ర్యాగింగ్, ప్రేమలో మోసాలు, ఆత్మహత్యలు వంటి దుష్పరిణామాలపై అవగాహన అవసరమని తెలిపారు. సమాజంలో యువత మంచి మార్గంలో నడవడానికి నైతిక విలువలు, సామాజిక బాధ్యత చాలాముఖ్యమని తెలిపారు. ఈ పాట ద్వారా విద్యార్థులలో మంచి మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు, ఇలాంటి కార్యక్రమాలు యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి భావోద్వేగపూరిత, సందేశాత్మక పాటను రూపొందించిన డోలా శ్యామలాదేవికి, సహకారం అందించిన పాఠశాల ఉపాధ్యాయులకు అభిన%శీ%దనలు తెలిపారు.



అనంతరం మార్కాపురం నూతన జిల్లా సాధించిన విజయోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని బాయ్స్ హైస్కూల్ అసిస్టెంట్ పిడి డోలా శ్యామలాదేవి మరియు పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివాదం ప్రిన్సిపాల్ వైఖరిపై విద్యార్థుల ఆరోపణలు





మన గళం, డోన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వైఖరిపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులను ఎలాంటి పోటీ పరీక్షలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సహించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రిన్సిపాల్ ఒత్తిడి కారణంగా విద్యార్థుల ప్రతిభకు అవకాశాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, డోన్ పట్టణంలోని యువకులు కలిసి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో గ్రౌండ్ అభివృద్ధి చేసి, క్రీడల కోసం కుర్చీలు ఏర్పాటు చేశారు. అయితే వాటిని ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు పూర్తిగా తొలగించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో ఆ ఏర్పాట్లు చేయించిన దాతలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని సమాచారం.అంతేకాకుండా ప్రిన్సిపాల్ కళాశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం లేదని, విద్యా కార్యకలాపాల్లో ఎలాంటి ప్రోత్సాహం చూపడం లేదని విద్యార్థులు, స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

## పొట్టి శ్రీరాములు ఆశయాలు మార్గదర్శకం

**– జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



మనగళం, నంద్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ తో కలిసి జిల్లా కలెక్టర్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చూపిన అచంచల దీక్ష, స్వార్థరహిత త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన జీవితం ప్రజాసేవకు అంకితమైందని, ప్రజల హక్కుల సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని మహనీయుడని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అందరూ శ్రీ పొట్టి శ్రీరాములు గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలి

**– రీ-ఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి – జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించి, సమయపాలనతో పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రీ-ఓపెన్ అయిన 525 దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దారులను ఆదేశించారు. ఇంకా చూసుకోని 76 దరఖాస్తులు ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు స్వీకరించిన 47,805 దరఖాస్తులలో 41,422 దరఖాస్తులను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న దరఖాస్తులతో పాటు వీఐపీ గ్రీవెన్స్‌లను కూడా అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. అకౌంట్స్ స్పేస్‌కు సంబంధించి ఇప్పటివరకు 7 లక్షల డాక్యుమెంట్లు అప్లోడ్ చేయగా, ఇంకా రెండు లక్షల డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాల్సి ఉందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, డ్రోన్ ద్వారా షై చేసిన వ్యవధిని తప్పనిసరిగా డ్రోన్ మార్ట్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**పింఛన్ మంజూరు చేయండి :** నా భర్త మరణించి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు వితంతు పెన్షన్ మంజూరు కాలేదని ఉయ్యాలవాడ మండలం, బోడెమ్మనూరు గ్రామానికి చెందిన జల్లిగాల్ల నాగేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా స్పందించి పింఛన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ



సమర్పించారు. ప్యాపిలి మండలం, ఉటకొండ గ్రామానికి చెందిన గోరంట్ల కిరణ్‌కు సర్వే నెం. 237లో మొత్తం 3.15 ఎకరాల భూమి ఉండగా, ఆన్లైన్‌లో కేవలం 2.46 ఎకరాల భూమి మాత్రమే నమోదు అయిందన్నారు. మిగిలిన 0.69 ఎకరాల భూమిని కూడా ఆన్లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. గోస్పాడు మండలం, యాళ్లూరు గ్రామానికి చెందిన ఎన్. సుధాకర్ రెడ్డికి సర్వే నెం. 316/ఏలో 4 సెంట్ల భూమి ఉండగా, రీ సర్వే సమయంలో 3.80 సెంట్లు మాత్రమే నమోదు అయిందన్నారు. మిగిలిన 0.20 సెంట్ల భూమిని పరిశీలించి ఆన్లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 267 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. స్వీకరించిన అర్జీలన్నింటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**– జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

మనగళం, నంద్యాల: జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో వాక్సిన్ వేయించి, పోలియో వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించాల్సిన బాధ్యతను అధికారులు సమర్థంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పల్స్ పోలియో కార్యక్రమం సన్నాహకాలపై జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు మొత్తం 2,38,404 మంది ఉన్నారని తెలిపారు. వీరందరికీ పోలియో చుక్కలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 1,318 బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందుకు 5,272 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఈ నెల 21న ఆదివారం రోజున బూత్ స్థాయిలో పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, అనంతరం 22, 23 తేదీలలో ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సంత మార్కెట్లు వంటి జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్సిట్ పాయింట్లు (బూత్‌లు) ఏర్పాటు చేసి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలు, వ్యవసాయ కూలీల పిల్లల కోసం మొబైల్ టీమ్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పని చేసి పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పోలియో చుక్కలకు




సంబంధించిన వాల్ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సి. సుదర్శన్ బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఓ. లలిత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రసన్న లక్ష్మి, డాక్టర్ శ్రీజ, డాక్టర్ శ్రీనివాసులు, అలాగే ఐసిడిఎస్, పంచాయతీరాజ్, విద్యుత్, విద్య, రవాణా తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆలూరులో కొనసాగుతున్న రిలే దీక్షలు.

**– హాజరైన విద్యార్థులు, రైతులు.**







( ఆలూరు మనగళం ): ఆదోని ను జిల్లా గా చేసే వరకు పోరాటం సాగిస్తామని ఆలూరు జెఏసి నాయకులు కత్తి రామాంజినేయులు, భూపేష్, ఎల్లప్ప, చంద్రకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఆలూరు బస్టాండ్ లో ఆదోని జిల్లా చేయాలంటూ చేపట్టిన రిలే దీక్ష 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలకు వాల్మీకి బోయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబీమ్ నాయుడు, మొలగవల్లి గ్రామం సర్పంచ్ మోహన్ రాజ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామాంజినేయులు, రైతు సంఘం నాయకులు. చాపల గోపాల్, వాల్మీకి నాయకులు శ్రీరాములు దీక్ష కు సంగీబావం ప్రకటించారు. ఆదోని జిల్లాగా అయితే అన్ని రంగాల్లో వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెంది పాలన సౌలభ్యం కలుగుతుందన్నారు.

# జర్నలిస్టుల హక్కులు, సంక్షేమమే లక్ష్యం

**– ఏపీయుడబ్ల్యుజే నంద్యాల పట్టణ నూతన కమిటీ ఏర్పాటు – అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రాజ్ కుమార్, మహబూబ్ బాషా**

మనగళం, నంద్యాల : జర్నలిస్టుల హక్కులు, సంక్షేమమే లక్ష్యమని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర నాయకులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, చలంబాబులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ నంద్యాల పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఏపీయుడబ్ల్యూజె సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్ లాల్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గసభ్యులు సివి చలం బాబు, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యులు మద్దిలేటి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగేంద్ర, వాసు, సుబ్బయ్య, మాజీ కార్యవర్గసభ్యులు రాజశేఖర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్ బాషా, గౌరవ సలహాదారులు జనార్దన్ రెడ్డి, శశిశేఖర్ శర్మ, సీనియర్ పాత్రికేయులు రమణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలే లక్ష్యంగా కమిటీ పనిచేస్తుందన్నారు. నంద్యాల పట్టణంలో జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేస్తూ వృత్తి గౌరవాన్ని కాపాడే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై వస్తున్న ఒత్తిడులు, వృత్తి సమస్యలపై ఐక్యంగా పోరాడతామని, యువ జర్నలిస్టులకు మార్గనిర్దేశం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా కలుబురుగి మహేష్, గౌరవ సలహాదారులు గా నాగ ప్రసాద్, ద్వారకనాథ్, ఎం. జైనుల్లావుద్దీన్, అధ్యక్షులుగా బి. రాజ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ బాష, అదనపు ప్రధాన కార్యదర్శిగా అరుణ్ కుమార్, కోశాధికారిగా మాలిక్ భాష, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శివకుమార్, అనుమల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా చంద్ర, అబ్రహం, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, బాలునాయక్, నూర్ భాషా, మేఘశ్యామ్, సహాయ కార్యదర్శులుగా జయ భారత్ రెడ్డి, కిరణ్, శేఖర్, ఇమ్రాన్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చోటా సింగ్, భరత్, చార్లెస్, మేడిశెట్టి కిరణ్, గణేష్,ఫిరోజ్, వేణుగోపాల్ రెడ్డి, పవన్, గోపాల్, హిదాయుతుల్లా, రాజు (సీవీఆర్), కిషోర్, వాసు, సాల్మన్ రాజు,



నాగరాజు, నిరంజన్, పవన్ యాదవ్, రఘులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏర్పాటు సందర్భంగా పలువురు జర్నలిస్టులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల పట్టణంలో జర్నలిస్టుల ఐక్యతకు ఈ కమిటీ దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రదీప్, నాగమణి, ఎలిజబెత్ రాణి, రఫీ, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రుణగ్రహీతలకు ఊరట

హైదరాబాద్ , డిసెంబర్ 15, మన గళం : సొంత ఇల్లు లేదా వాహనం కొనాలని భావిస్తున్న వారికి ప్రభుత్వ రంగ బ్యాంకు శుభవార్త చెప్పింది. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు డిసెంబర్ పదిహేనునుంచి హోం రుణాలు, వాహన రుణాలు, సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్పుతో ఇప్పటికే రుణాలు తీసుకున్న లక్షలాది మంది ఖాతాదారులకు నెలవారీ ఈఎంఐ భారం తక్కువ కానుంది.

బ్యాంకు తన ప్రధాన రుణ బెంచ్‌మార్క్ రేట్లలో కోత విధించింది. అన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆధారిత రుణ రేటును స్వల్పంగా తగ్గించింది. దీంతో ఒక సంవత్సరం కాలపరిమితి రుణాలపై వడ్డీ శాతం మరింత తక్కువైంది. అదే విధంగా ఫ్లోటింగ్ రేటు రుణాలకు ఆధారమైన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రుణ రేటును కూడా గణనీయంగా తగ్గించింది. ఈ నిర్ణయం హోం లోన్‌లు, ఆటో లోన్‌ల ఈఎంఐలపై నేరుగా ప్రభావం చూపనుంది.

రుణాలకే కాకుండా కొన్ని టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను కూడా బ్యాంకు స్వల్పంగా తగ్గించింది. రెండు నుంచి మూడు సంవత్సరాల కాలపరిమితి డిపాజిట్లపై సాధారణ వడ్డీ తగ్గగా, సీనియర్ సిటిజన్లకు ఇచ్చే అదనపు వడ్డీ కూడా స్వల్పంగా తగ్గింది. అలాగే నాలుగు వందల నలభై నాలుగు రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును సవరించింది.

ఇక ద్రవ్యోల్బణంపై బ్యాంకు తన అంచనాలను వెల్లడించింది. పన్నుల తగ్గింపు వల్ల రాబోయే నెలల్లో వినియోగ ధరల సూచిక కొంత తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం మరింత నియంత్రణలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది.

ఈఎంఐ తగ్గింపు ప్రయోజనం పొందాలంటే ఖాతాదారుల రుణాలు ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటుకు అనుసంధానమై ఉండాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే బ్యాంకు తీసుకున్న ఈ నిర్ణయం రుణగ్రహీతలకు ఆర్థికంగా పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (15.12.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం,



విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

# సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయండి





మన గళం గూడూరు: ఈనెల 31 నుండి 2026 జనవరి 4 వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి జె మోహన్ పిలుపునిచ్చారు,, సిఐటియూ అఖిల భారత 18 వ మహాసభల జయప్రదం చేయాలని కోరుతూ గూడూరులో సిఐటియు కార్యాలయం ముందు మరియు బస్టాండ్ సెంటర్లో, సిఐటియు నాయకులు రాజశేఖర్ అధ్యక్షతన సిఐటియు డివిజన్ కార్యదర్శి జే,మోహన్,మండల నాయకులు వెంకటేశ్వర్లు, నాగలాపురంలో సిఐటియు అయ్యన్న లు సిఐటియు జెండాలు ఆవిష్కరించడం జరిగింది,,. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి

జే, మోహన్ మాట్లాడుతూ..... స్వాతంత్రోద్యమ వారసత్వంలో పుట్టి కార్మిక వర్గ ఆశయానికి అంకితమైన సంస్థ సిఐటియు అని, దేశవ్యాప్తంగా యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశయమని, కార్మిక కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యమని, ఈ ఆశయ సాధన ద్వారానే కార్మిక వర్గం నేడు ఎదుర్కొనే సర్వ సమస్యలను పరిష్కరిస్తుందని, ఐక్య పోరాటం నినాదంతో దేశంలోని అన్ని సమరశీల పోరాటాల్లో సిఐటియు అగ్రభాగాన ఉందని, స్వాతంత్ర ఉద్యమం నుండి నేటి వరకు కార్మికపక్షాల నిలబడి సిఐటియు కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు అనేక పోరాటాలు చేస్తున్నదని, ఈరోజు దేశవ్యాప్తంగా కార్మిక పక్షాన నిలబడి పోరాటం చేయడంలో సిఐటియు మొదటి స్థానంలో ఉన్నదని, అటువంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మన ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో జరుగుతున్నవని, నేడు కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని, ఈ లేబర్ కోడ్ల వలన కార్మికులు తమకున్న హక్కులను కోల్పోతారని, జీతాలు పెంచమని లేక ఇవ్వమని హక్కులు కోల్పోతారని, నేషనల్ తెలిపితే జైళ్లకు పంపే విధంగా ఈ కోడ్లు తయారు చేశారని, ఈ దేశంలోని ప్రభుత్వ సంపాదనను అంబానీ ఆదానిలాంటి బడా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ఈ నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ లేబర్ కోడ్లపై రాష్ట్రంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని, అధికారంలోకి రాకముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని, ఇటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై రేపు విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు తీర్మానాలు చేయబోతున్నారని, అటువంటి సిఐటియు అఖిలభారత మహాసభలను జనవరి 4వ తేదీన జరిగే బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగ కార్మికులు రైతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయవలసిందిగా వారు పిలుపునిచ్చారు... కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రవి. సిఐటియు నాయకులు కృప, నగేష్, సురేష్, దానమన్న,హమాలి కార్మిక సంఘం నాయకులు మునియప్ప, కొమ్ము రాజు,గోపి, రామాంజనేయులు, చిన్న రాజు, అబ్రహం, ఏసేపు, ఆటో యూనియన్ నాయకులు, రాజు, మధు, నాగలాపురంలో శేఖరు సుంకన్న మరియు హమాలి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన



మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (14.12.2025) శ్రీ రాయన శ్రీనివాసరావు మరియు వారి బృందం, విజయవాడ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో మూషికవాహన, భోశంభో... శివశంభో, లింగాష్టకం, తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు బిందుశ్రీ, మానస, లక్ష్మీగీర్వాణి, ఎస్ అనుశ్రీ, హిమశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీ రాజరాజేశ్వర భారత కళాసమితి, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# ఆదోని జిల్లా సాధనకు ఉద్యమించాలి




మనగళం, ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు లోనే వైయస్సార్ సర్కిల్లో ఆదోని జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో 6వ రోజు రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షురాలు ఈరమ్మ నాయకులు ఏలీషమ్మ, మరియమ్మ, హుస్సేన్ బీ, రంగమ్మ, కాసింబీ దీక్షకు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ ఆదోని జిల్లా ఏర్పడితే ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గం ప్రయాణపరంగా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆదోని జిల్లా డిమాండ్ ఈనాటిది కాదని 2012 సంవత్సరం నుండి ఉందని గుర్తు చేశారు. అయితే టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఆదోని జిల్లా సమంజసమైన నిర్ణయం అనే రైల్వే సౌకర్యం భౌగోళిక పరిస్థితులు రీత్యా కేంద్రంగా ఉంటుందని కొందరు నాయకులు దీన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆదోని జిల్లా కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టామని, మున్ముందు కూడా ఇంకా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శేఖర్, కృష్ణ, ఉదయ్, కాజా, రఘు, అఫ్రిది, నల్లారెడ్డి, గణేష్, బతకన్నా, వామపక్ష నాయకులు సత్తెన్న, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూపీఐ యాప్స్ వాడేవారికి హెచ్చరిక..

హైదరాబాద్ , డిసెంబర్ 15, మన గళం : ప్రస్తుతం డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ సేవలన్నీ మొబైల్ ద్వారానే అందుబాటులోకి వచ్చాయి. అకౌంట్ ఓపెనింగ్ నుంచి నగదు లావాదేవీలు, రుణాలు, కార్డుల సేవల వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. యూపీఐ సదుపాయం వచ్చాక నగదు పంపడం, స్వీకరించడం మరింత సులభమైంది. ఒక నిమిషంలోనే లావాదేవీలు పూర్తవుతుండటంతో యూపీఐ యాప్స్ వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే ఇదే అవకాశంగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మోసాలతో ప్రజలను బుట్టలో వేసుకుంటున్నారు.




ఇటీవల యూపీఐ యాప్స్‌లో నకిలీ అకౌంట్లు సృష్టించి, బ్యాంక్ పేరుతో లింకులు పంపిస్తూ, కేవైసీ అప్‌డేట్ పేరుతో డబ్బులు కొల్లగొడుతున్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మి చాలా మంది తమ కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా అనుమానాస్పద నంబర్లకు లేదా తెలియని యూపీఐ ఐడీలకు డబ్బులు పంపేటప్పుడు అత్యంత జాగ్రత్త అవసరం. యాప్‌లో హెచ్చరిక సందేశాలు కనిపించినా పట్టించుకోకుండా పంపితే మోసపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు యాప్ నోటిఫికేషన్లను జాగ్రత్తగా పరిశీలించాలి. బ్యాంక్ పేరుతో వచ్చే నకిలీ లింకులను క్లిక్ చేయకుండా ఉండాలి. అనుమానాస్పద యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల వ్యక్తిగత సమాచారం దొంగల చేతికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. ఏదైనా సంస్థకు డబ్బులు పంపే ముందు ఆ సంస్థ నిజమైనదేనా కాదా అని అధికారిక వెబ్‌సైట్ల ద్వారా నిర్ధారించుకోవాలి. మోసం జరిగిందని అనుమానం వచ్చిన వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేయాలి. అలాగే సైబర్ నేరాల నివారణ కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ 1930కు వెంటనే కాల్ చేయడం ద్వారా నష్టం తగ్గించే అవకాశం ఉంటుంది. మొత్తంగా చూస్తే, యూపీఐ యాప్స్ వాడకం సౌకర్యవంతమైనదే అయినా, చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారి తీస్తుందని గుర్తుంచుకుని ప్రతి లావాదేవీని జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

# మీకు కారు ఉందా.?

హైదరాబాద్ , డిసెంబర్ 15, మన గళం : ఆరోగ్య బీమా మనిషికి ఆర్థిక భద్రత ఎలా అందిస్తుందో, అదే విధంగా వాహన బీమా ప్రమాదాల సమయంలో కార్లకు రక్షణగా నిలుస్తుంది. రోడ్డు ప్రమాదాలు, సహజ విపత్తులు, మానవ తప్పిదాల వల్ల వాహనాలకు నష్టం కలిగినప్పుడు కార్ ఇన్సూరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. గత కొన్నేళ్లలో మోటార్ ఇన్సూరెన్స్ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యమైనది క్యాష్‌లెస్ కార్ ఇన్సూరెన్స్ విధానం. ఈ విధానంతో వాహన యజమానులు జేబు నుంచి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండా కారు రిపేర్ చేయించుకునే అవకాశం లభిస్తుంది. క్యాష్‌లెస్ కార్ ఇన్సూరెన్స్ బీమా కంపెనీలతో ఒప్పందం చేసుకున్న నెట్వర్క్ గ్యారేజీల్లో అందుబాటులో ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే బీమా కంపెనీకి సమాచారం ఇస్తే, సమీపంలోని నెట్వర్క్ గ్యారేజీ వివరాలను కస్టమర్ సపోర్ట్ లేదా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలియజేస్తారు. వాహనాన్ని ఆ గ్యారేజీకి తీసుకెళ్లిన తర్వాత క్లెయిమ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అవసరమైన డాక్యుమెంట్లు సమర్పిస్తే సరిపోతుంది. మిగతా ప్రక్రియ అంతా బీమా కంపెనీ, గ్యారేజీ మధ్యనే జరుగుతుంది. రిపేర్ ఖర్చును బీమా కంపెనీ నేరుగా గ్యారేజీకి చెల్లిస్తుంది.



ఈ విధానంలో క్లెయిమ్ సెటిల్మెంట్ చాలా సులభంగా, వేగంగా పూర్తవుతుంది. పేపర్‌వర్క్ తక్కువగా ఉండటం, ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పారదర్శకత ఉండటం వల్ల వినియోగదారులకు సమయం, శ్రమ రెండూ ఆదా అవుతాయి. చెల్లింపుల విషయంలో గందరగోళం లేకుండా మొత్తం వ్యవహారం సాఫీగా సాగుతుంది. మరోవైపు, నెట్వర్క్ గ్యారేజీలు బీమా ఉన్న వాహనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. చెల్లింపులు బీమా కంపెనీల నుంచే వస్తుండటంతో రిపేర్ పనులు ఆలస్యం కాకుండా త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది. మొత్తంగా చూస్తే క్యాష్‌లెస్ కార్ ఇన్సూరెన్స్ వల్ల ప్రమాదం తర్వాత వాహన యజమానిపై పడే ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది. డబ్బుల కోసం ఆందోళన పడకుండా, కారు రిపేర్‌పై మాత్రమే దృష్టి పెట్టే వెసులుబాటు లభిస్తుంది. అందుకే నేటి రోజుల్లో ఎక్కువ మంది వాహన యజమానులు ఈ విధమైన క్యాష్‌లెస్ ఇన్సూరెన్స్ పాలసీలను ప్రాధాన్యతగా ఎంచుకుంటున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

– మంత్రి ఎన్ఎండి ఫరూక్





మనగళం, నంద్యాల : తెలుగు ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయం అని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. స్థానిక సంజీవనగర్ గేటులోని అమరజీవి విగ్రహానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే ఏకైక ధృఢ నిశ్చయంతో పొట్టి శ్రీరాములు సుదీర్ఘ పోరాటం చేశారని కొనియాడారు. "పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన త్యాగం మనందరిలో దేశభక్తిని, నిస్వార్థ సేవను నింపారన్నారు. ఆయన కేవలం ఆంధ్ర రాష్ట్రం కోసం మాత్రమే పోరాడలేదని, దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆత్మార్పణతోనే నాంది పలికారన్నారు. భారతదేశ చరిత్రలోనే ఒక భాషా సమూహం కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని తెలిపారు. శ్రీరాములు దీక్ష, త్యాగ ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి, తెలుగు మాట్లాడే ప్రజల కోసం మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. ఈ చారిత్రక ఘట్టం దేశంలోని ఇతర భాషా సమూహాలకూ స్ఫూర్తినిచ్చి, భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజనకు దారి తీసిందని పేర్కొన్నారు. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి పొట్టి శ్రీరాములు చేసిన ఈ మహోన్నత త్యాగాన్ని ఎన్నటికీ మర్చిపోకూడదని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మన తెలుగు రాష్ట్ర చరిత్రలో పొట్టి శ్రీరాములు త్యాగం సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, అందరూ సమష్టిగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీవాణి , మున్సిపల్ కమిషనర్ శేషన్న, టీడీపీ నాయకులు బింగుమల్లె శ్యామ్ సుందర్ గుప్తా, వేణు , చలం బాబు, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఒప్పుకోం

- వైసీపీ ప్రజా ఉద్యమానికి ప్రజల సంపూర్ణ మద్దతు – స్వచ్ఛందంగా సంతకాలు చేసిన జనం
- ఇప్పటికైనా కూటమి సర్కార్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి – వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి






మనగళం, నంద్యాల : కూటమి సర్కార్ కుట్రలు పన్నుతూ చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఏ మాత్రం ఒప్పుకోమని ప్రజలు తేల్చిచెప్పారని, ఇందుకు సాక్ష్యం వైసీపీ చేపట్టిన కోటి సంతకాలకు ప్రజల నుంచి ఆధరణ అని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేసి మరీ తమన మద్దతు తెలిపారన్నారు. కూటమి సర్కార్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ప్రజల నుండి నాలుగు లక్షలకు పైగా సేకరించిన సంతకాల ప్రతులను సోమవారం జిల్లా కేంద్రం నంద్యాల నుంచి డీసీఎం వాహనంలో తాడేపల్లి ప్రధాన కార్యాలయానికి నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కలపలత రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపి రెడ్డి తదితర నాయకులతో కలిసి కాటసాని రామ్ భూపాల్ రెడ్డి జెండా ఊపి పంపారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు వైసీపీ శ్రేణులతో కలిసి నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. వైద్య కళశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాటసాని రామ్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాలన్నీ పూర్తి చేశామన్నారు. ఎక్కడికి వెళ్ళినా ప్రజలు స్వచ్ఛందంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల కు, ప్రవేట్ మెడికల్ కాలేజీలకు ఉన్న భేదం ఏంటంటే ప్రైవేట్ హాస్పిటల్ లో డబ్బులు చెల్లించి వైద్యం చేపించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ప్రజలకు వైద్యం ఉచితంగా చేయడానికి వీలవుతుందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఎందుకు చేయకూడదంటే చదువుకున్న పేద ప్రజలందరికీ మెరిట్ వచ్చిన విద్యార్థులకు ఒక్క రూపాయి డొనేషన్ కట్టకుండా ఎంబీబీఎస్ సీటు వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఐదు మెడికల్ కాలేజీ లను పూర్తి చేయడం జరిగిందన్నారు. నంద్యాలలో మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యి ఎంబీబీఎస్ విద్యార్థులు చదువుతున్న పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి మంచి పేరు రాకూడదు అనే ఉద్దేశంతోనే మెడికల్ కాలేజీలు అన్ని కూడా పీపీసీ విధానంతో ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరూ కూడా ఒకసారి ఆలోచించాలి, కుటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలలో రెండు లక్షల 66 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క రైతుకు గిట్టుబాటు ధర లేని పరిస్థితి నెలకొందన్నారు. యూరియా కోసం రోడ్లమీద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వంలో చూస్తున్నాం. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పాణ్యం నియోజకవర్గం, గడివేములలో జొన్నలకు రేటు లేకపోతే ఆరోజు మార్ఫెడ్ తో మాట్లాడి అందరికీ సబ్సిడీ ఇప్పించామని గుర్తు చేశారు.




## 18న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానము ద్వారా 12 మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేయడం దారుణమని, తక్షణమే జీ.వో 590 ను రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ డిసెంబర్ 18 న సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కర్నూలు జిల్లాలో ఆదోని మెడికల్ కాలేజీ దగ్గర, కర్నూలు కలెక్టర్ ఆఫీస్ ముందు, పత్తికొండ ఆర్డిఓ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున నిరసనలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాల మంజూరయ్యాయని, ఐదు కళాశాలలో అడ్మిషన్లు జరిగాయని, మిగిలిన 12 కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తికానందున ప్రారంభం కాలేదన్నారు. పూర్తిచేసిన 5 మెడికల్ కాలేజీలలో గత ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా సగం సీట్లను భర్తీ చేయాలని, అమ్ముకోవచ్చని నిర్ణయించినప్పుడు వామపక్ష పార్టీలు, మేధావులు,విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు కూడా వ్యతిరేకించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణాలు పూర్తి చేసి పేద సామాన్య విద్యార్థులకు చదువుకోవడానికి అవకాశం కల్పించాల్సింది పోయి పీపీపీ విధానం ద్వారా సీఎం ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్ణయం ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీలు, అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు వైద్య విద్యను దూరం చేయడమేనని, ప్రైవేటీకరణ చేయడం వలన పేద సామాన్య కుటుంబాల విద్యార్థులు వైద్య విద్య చదివే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకొని మెడికల్ కళాశాల లను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# ప్రెస్ క్లబ్ కు సంకెళ్లు!

- కార్యాలయానికి తాళం వేసి ఐరన్ గొలుసు చుట్టిన వ్యతిరేకులు
- భగ్గుమన్న విలేకరుల మధ్య విభేదాలు
- అసహనం వ్యక్తం చేసిన అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త



మనగళం, కర్నూలు సిటీ : ఉమ్మడి కర్నూలు జిల్లా విలేకరుల చిరకాల కోరిక... ప్రెస్ క్లబ్. ఏళ్లతరబడి జర్నలిస్టు నాయకులు ప్రెస్ క్లబ్ కోసం పోరాడుతూనే వచ్చారు. చివరకు సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ గుప్త అంకితభావంతో చేసిన ప్రయత్న ఫలించింది. దాదాపు నాలుగు నెలల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఏ క్యాంప్ ఆర్ అండ్ బీ క్వాటర్స్ లోని 5,6 క్వాటర్స్ కేటాయించారు. అయితే కొందరు విలేకరులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. అయినా పాడుపడిన భవనాలకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త ఎంతో శ్రమించి కొంతమేర మౌలిక వసతులు సమకూర్చారు. తాను ఎవ్వరినీ విరాళం అడగనని నిక్కచ్చితంగా తేల్చిచెప్పిన సత్యనారాయణకు కొందరు దాతలు స్వచ్ఛందంగా కుర్చీలు, బీరువాలు, ఎలక్ట్రిక్ వస్తువులు సైతం అందజేశారు. చివరకు ఓ దాత సీసీ కెమెరా ఏర్పాటు చేయించారు కూడా. త్వరలో అధికారికంగా ప్రారంభించిందేకు అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం వ్యతిరేకులు మరోఅడుగు ముందుకేశారు. ఏకంగా ప్రెస్ క్లబ్ కార్యాలయానికి తాళం వేయడంతోపాటు ఇనుప గొలుసు బిగించి తమ వ్యతిరేకతను చాటారు. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రెస్ క్లబ్ కు సంకెళ్లు వేశారు. ఆదివారం రాత్రి ఎవ్వరూ లేని సమయంలో దాదాపు పదిమంది వచ్చి ప్రెస్ క్లబ్ కార్యాలయానికి తాళం వేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు సమాచారం. ఈ చర్యపై ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్దయ్య, సత్యనారాయణ, సుజాత, చంద్రశేఖర్, అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త అసహనం చేశారు. వెంటనే సోమవారం విషయాన్ని వివరిస్తూ డీఆర్వో వెంకట నారాయణమ్మకు సత్యనారాయణ గుప్త వినతి పత్రం అందజేశారు. స్పందిచిన డీఆర్వో ఆర్ అండ్ బీ అధికారితో ప్రెస్ క్లబ్ ను హోల్డ్ లో ఉంచాలని సూచించారు.

## భారీగా పెరిగిన బంగారం ధరలు..

హైదరాబాద్ , డిసెంబర్ 15, మన గళం : దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగి సరికొత్త రికార్డును నమోదు చేశాయి. హైదరాబాద్ మార్కెట్‌లో ఇరవై నాలుగు క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర పది గ్రాములకు రూ.137430కు చేరింది. అదే సమయంలో ఇరవై రెండు క్యారెట్ల ఆభరణాల బంగారం ధర పది గ్రాములకు రూ.125850గా కొనసాగుతోంది. ఇటీవల వరుసగా పెరుగుతున్న బంగారం ధరలు కొనుగోలుదారులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ దగ్గరపడుతుండటంతో సామాన్య ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా జోరుగా పెరిగాయి. దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.196948 స్థాయికి చేరింది. ఈ ధరల పెరుగుదలకు అంతర్జాతీయ మార్కెట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర 4340 డాలర్లకు చేరగా, వెండి ధర 63 డాలర్లకు పైగా ట్రేడవుతోంది. అమెరికా డాలర్ బలహీనత, వడ్డీ రేట్లపై అక్కడి కేంద్ర బ్యాంకు తీసుకుంటున్న నిర్ణయాలు విలువైన లోహాల ధరలపై ప్రభావం చూపుతున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.